క్లుప్తంగా

నేడు ఓపెన్ ఫోరం

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలో 2024–25సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లాజరస్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, కూలీలు హాజరు కావాలని కోరారు.

ఎండిన వరిపొలాల పరిశీలన



ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని మామిడాల గ్రామంలో ఎండిన వరిపొలాలను మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇప్పటి వరకు 71ఎకరాలలో వరిపంట ఎండిపోయిందని, మరో 250ఎకరాలలో నీరు అందక ఎండిపోయే పరిస్థితుల్లో ఉన్నాయని తెలిపారు.

ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా అధికంగా వరిసాగు చేసినందున అధికారులు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నీటి విడుదల అంతంత మాత్రంగా ఉండడంతో చాలామంది రైతుల వేలాది ఎకరాల పొలాలు ఎండిపోతున్నాయని, వెంటనే అధికారులు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎకరానికి రూ.30వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

అందుబాటులో యూరియా

తుంగతుర్తి : తుంగతుర్తి రైతు సేవ సహకార సంఘంలో రైతులకు యూరియా అందుబాటులో ఉందని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు సేవ సహకార సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతు సేవా సహకార సంఘం మహాజన సభను ఈ నెల–29న నిర్వహించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. తుంగతుర్తి సొసైటీలో 844బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి వందనపు వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మోడెం శ్రీలత, డైరెక్టర్లు యాదగిరి, రామచంద్రు, మల్లయ్య, మజీద్, భిక్షంరెడ్డి, రామనర్సమ్మ, ఈదయ్య, యాకయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎడ్ల గోపయ్యకు ఘన నివాళి



ఎడ్ల గోపయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వేణారెడ్డి

సూర్యాపేట : ఎడ్ల గోపయ్య సేవలు మరువలేనివని, వారి సేవలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవకు ముందుంటానని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం మాలమహానాడు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల గోపయ్య వర్ధంతిలో పాల్గొని గోపయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మాలమహానాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల ముక్కంటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బొల్లెద్దు దశరథ, బొల్లెద్దు బుచ్చిరాములు, బొల్లెద్దు గోపయ్య, న్యాయవాదులు తల్లమల్ల హసేన్, ఏడిండ్ల అశోక్, వసంత సత్యనారాయణపిళ్లే, అశోక్, బొయిల అఖిల్, గోపి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తుంగతుర్తి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మండల పోలీసులు పట్టుకుని బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి శివారులో తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అర్వపల్లి నుంచి తుంగతుర్తి వైపు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హైవేపై సెంట్రల్ లైట్లకు మరమ్మతులు



లైట్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : నకిరేకల్–తానంచర్ల 365హైవేపై అర్వపల్లిలో జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి రోడ్లలో గల సెంట్రల్ లైట్లకు రహదారి నిర్వహణ ప్రతినిధులు బుధవారం మరమ్మతులు ప్రారంభించారు. కొంత కాలంగా లైట్లు పనిచేయకపోవడంతో ఈ హైవే అంధకారంగా మారింది. దీంతో కొత్త లైట్ల ఏర్పాటుతో పాటు మరమ్మతులు చేపడుతున్నారు.

అభివృద్ధికి ‘ఉపాధి’ నిధులు

- రూ.3.25కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం
- 45పనుల మంజూరుకు గాను 19 పూర్తి
- మార్చి నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు

పెన్‌పహాడ్ : గ్రామపంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని వివిధ గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించేందుకు మండలానికి రూ.3.25 కోట్ల నిధులు మంజూరు చేసింది. నిధులతో మండలంలోని 29గ్రామపంచాయతీల్లో 45 చోట్ల సీసీరోడ్లు నిర్మించనున్నారు. ఈ నిధులు జనవరిలో మంజూరు కాగా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. ఇప్పటికే 19పనులు పూర్తి కాగా మిగతా గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం కొనసాగుతున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో అత్యవసరమైన చోట్ల సీసీరోడ్లు



మేగ్యాతండాలో పూర్తయిన సీసీరోడ్డు

నిర్మాణం చేపడుతున్నట్లు ప్రత్యేక అధికారులు చెబుతున్నారు. ఈ నిర్మాణ పనులు త్వరగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామాల్లో చేపడుతున్న సీసీరోడ్లు నాణ్యతగా చేపట్టాలని, మొదట అత్యవసరం ఉన్నచోట నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా పనులు సాగుతున్నాయి



ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామపంచాయతీల్లో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించాం. మండలంలో 45 పనులు మంజూరు కాగా ఇప్పటి వరకు 19పనులు పూర్తి చేశాం. మిగతా పనులు మార్చి 31వరకు పూర్తి చేయాల్సి ఉంది. సాధ్యమైనంత త్వరగా రోడ్ల నిర్మాణం చేపట్టాలి. సకాలంలో పనులు పూర్తి చేస్తే ఎంబీ రికార్డు చేసి బిల్లులు త్వరగా పొందే అవకాశం ఉంటుంది.

– శ్రీకాంత్‌రెడ్డి, పీఆర్ ఏఈ

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలంలో షెడ్లు నిర్మిస్తాం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ చామంతినరేష్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో గతంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి స్థలం కేటాయించారని, ఆ కేటాయింపులను రద్దు చేసి అదేస్థలంలో రైతులకు ఉపయోగపడే విధంగా ఎమ్మెల్యే సామేల్ సహకారంతో అదనపు షెడ్లు, భవనాలు నిర్మిస్తామని వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ అన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్‌లోని షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్‌కు ప్రతిరోజు 30వేల నుంచి 50వేల బస్తాల వరకు ధాన్యం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తే ఇటు రైతులకు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వేరే స్థలంలో నిర్మించడానికి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర వచ్చే విధంగా చూస్తామన్నారు. మార్కెట్ యార్డులోకి కోతులు, మేకలు రాకుండా చుట్టూ సోలార్ ఫెన్సింగ్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు రాపాక సోమేష్, గాదరబోయిన ఉప్పలయ్య, మార్కెట్ కార్యదర్శి అనిల్, నాయకులు అబ్బాస్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి : ఎస్పీ



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ నర్సింహా

సూర్యాపేట టౌన్: పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులపై దర్యాప్తు వేగంగా చేపట్టి ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని ఎస్పీ నర్సింహ ఆదేశించారు. బుధవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, పోలీస్ స్టేషన్ నిర్వహణను, రిసెప్షన్ నిర్వహణ, ఫిర్యాదుల నమోదు పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సీసీఎస్ విభాగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

పోలీసు కుటుంబాలకు ఎస్పీ అభినందనలు

జిల్లా కోర్టులో లైజన్ అధికారిగా పనిచేస్తున్న ఏఎస్ఐ సురేంద్రబాబు కుమారుడికి, స్పెషల్ కోర్టులో లైజన్ అధికారిగా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ కుమార్తెకు గ్రూప్–1లో మంచి మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ కె.నరసింహ ఇరువురిని బుధవారం తన చాంబర్‌లో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల హక్కుల సాధనకు నిరంతర పోరాటం

సూర్యాపేట : మహిళల హక్కుల సాధనకు నిరంతరం పోరాటాలు చేసేది ఐద్వా మాత్రమేనని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి అన్నారు. బుధవారం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని 23వ వార్డులో సంఘం జెండాను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఐద్వా దేశవ్యాప్తంగా పట్టణాల్లోనూ గ్రామాల్లోని మహిళలను సమీకరించి మహిళల సమస్యల కోసం బలమైన మహిళా ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పిట్టల రాణి, శశిరేఖ, సైదమ్మ, నీరజ, శాలిని, ఆగమ్మ, ఉష రాణి, భిక్షమమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న మద్దెల జ్యోతి

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారం అపహరణ

చివ్వెంల(సూర్యాపేట): తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 12 తులాల బంగారం అపహరించారు. ఈ ఘటన చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుడకుడ గ్రామంలోని స్నేహనగర్‌కు చెందిన మహ్మద్ పాష కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. మంగళవారం వారిద్దరు ఇంటికి తాళం వేసి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో ఇంట్లోకి చొరబడి బీరువాలోని 12 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన మహ్మద్ పాష, అతడి భార్య చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ రవి పరిశీలించారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

సూర్యాపేటటౌన్ : ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరామ్ సూచించారు. బుధవారం పట్టణంలోని రాఘవ ప్లాజా జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దన్నారు. హెల్మెట్లు లేకుండా వాహనం నడపడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడంతో ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. ప్రతి ఒక వాహనదారుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకోవాలన్నారు. అదే విధంగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్ష

చివ్వెంల : రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు, నియామకాలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్ష బుధవారం కొనసాగింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొంగల సతీష్, కటకొట్ల సైదులు, ఆదిమళ్ల మోహన్, మొండికత్తి మనోజ్, జానకి రాములు, జగదీష్, మొండికత్తి గోపిచంద్, బాబు, సంతోష్, నగేష్, అభి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎస్సీ వర్గీకరణ చేయకుండా గ్రూప్–1, గ్రూప్– 2, గ్రూప్ –3 ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని, మాదిగ విద్యార్థులకు అన్యాయం చేయొద్దని, సీఎం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుకూరు సోమన్న డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష బుధవారం రెండోరోజు కొనసాగింది. దీక్షలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ నాయకులు కందుకూరి శ్రీను, డప్పు కళాకారుల సంఘం తిరుమలగిరి మండల శాఖ అధ్యక్షుడు కందుకూరి రవి, బోడ సోమయ్య, బోడ భిక్షపతి, పత్తేపురం ప్రభాకర్, పత్తేపురం వెంకన్న, పోతరాజు ప్రవీణ్, సోమేశ్వర్, మహేష్, ఎరబ్రెల్లి శ్రీను పాల్గొన్నారు.



చివ్వెంల : దీక్షలో పాల్గొన్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం అమలయ్యేంత వరకు ఉద్యోగ నియామకాలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ములకలపల్లి రవిమాదిగ, మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, అధికార ప్రతినిధి మిరియాల చిన్ని, ఇరుగు యాదయ్య, ములకలపల్లి సైదులు, మహేష్, శీను, ప్రియదర్శిని, రాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

నూతనకల్ : మండలంలోని చిల్పకుంట్ల గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం బుధవారం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడారు. ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బండపల్లి అన్నపూర్ణ, బత్తుల రేణుక, సరస్వతి, వైద్య సిబ్బంది సీతారాంరెడ్డి, రజిని, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసంలో పాల్గొన్న అధికారులు

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అన్నారం గ్రామంలో సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకునేలా హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, నాయకులు జానయ్య, సోమయ్య, లింగయ్య, బాలయ్య, నర్సిరెడ్డి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు ఉపాధి పనులు కల్పించాలి

చివ్వెంల : సూర్యాపేట పట్టణంలో విలీనమైన గ్రామాల్లోని పేదలకు ఉపాధిహామీ పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. సూర్యాపేటలో విలీనమైన గ్రామాల్లో పేదలు ఉపాధిహామీ పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పింగిగ నాగమణి, ఉయ్యాల నగేష్, కంచుగట్ల శ్రీను, మద్దికుంట్ల శ్రీను, మద్దికుంట్ల సైదులు, రమేష్, తిరుపతమ్మ, రేణుక, అనూష, లింగమ్మ, భారమ్మ, పద్మ, లక్ష్మీ, మల్లేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులో రాయితీ ఇవ్వాలి

భానుపురి (సూర్యాపేట) : గ్రేటర్ హైదరాబాద్ తరహాలో ఆస్తిపన్ను వన్‌టైం సెటిల్‌మెంట్ 90శాతం వడ్డీ రాయితీ మున్సిపాలిటీలు సైతం ప్రకటించాలని సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీతారాంపురంలో నిర్వహించిన పార్టీ వన్ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024–2025సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను చెల్లించే వారికి వడ్డీ 90శాతం రాయితీ ఇవ్వడంతో ఇంటి పన్నులు 100శాతం పూర్తయి మున్సిపాలిటీలకు ఆదాయం రావడానికి అవకాశం ఉందన్నారు. అనేక ప్రాంతాలలో ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని, వాటి వసూలు కోసం ఈ రాయితీ స్కీమ్ ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య, కప్పల సత్యం, నగిరి జయమ్మ, పిట్టల రాణి, గంగపురి శశిరేఖ, ఎర్రయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



తుంగతుర్తి : సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట: మున్సిపాలిటీలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని అదనపు కలెక్టర్, సూర్యాపేట మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి పి.రాంబాబు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో బకాయి పన్నుల వసూలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపన్నులు, నల్లా బిల్లులు చెల్లించని గృహ, వాణిజ్య, వ్యాపార సంస్థల వారికి రెడ్ నోటీసులు జారీ చేసి మున్సిపల్ జప్తు చట్టం ప్రకారం ఆస్తులను జప్తు చేసి ఇంటి నల్లా కనెక్షన్‌ను శాశ్వతంగా తొలిగించాలన్నారు. వందశాతం పన్నులు వసూలు చేయని అధికారులు, బిల్ కలెక్టర్‌ల జీతాలు నిలిపివేస్తామన్నారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

టార్గెట్ ప్రకారం రోజుకు రూ.26 లక్షలు వసూలు చేయాలని ఆదేశించారు. సెలవు దినాల్లో కూడా పన్నులు వసూలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, ఆర్వో కల్యాణి, ఆర్ఐలు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పాటించడం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తియాదవ్

సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం పాటిస్తూ ఎమ్మెల్యే కోటాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మిత్రపక్ష పార్టీ సీపీఐకి ఒక స్థానం కేటాయించడం హర్షణీయమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధానమంత్రి బీసీ కులానికి చెందిన వ్యక్తి అయ్యుండి కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీలు సామాజిక న్యాయం పాటించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. 2011లో జనగణన జరిగిందని, కేంద్ర ప్రభుత్వం 2021లో జనగణన చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు జనగణన చేపట్టలేదని విమర్శించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు బీసీలకు సముచితమైన ప్రాధాన్యత కల్పించడంలో డైలమాలో ఉన్నాయన్నారు. సమావేశంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్‌గుప్తా, మాజీ కౌన్సిలర్లు షఫీ ఉల్లా, వెంకన్న, జ్యోతి కరుణాకర్, యాట వెంకన్న, కర్ణాకర్, ధర్మా, పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం



నాగారం : పస్తాల ప్రాథమిక పాఠశాలలో..



మద్దిరాల : గోరెంట్ల ప్రాథమిక పాఠశాలలో..

మద్దిరాల : మండలంలోని గోరెంట్ల ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం ఎస్‌డీ.జహీర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రాజ్యలక్ష్మి, వెంకన్న, కె.ఉమారాణి, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగారం : మండలంలోని పూలగడ్డ పస్తాల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల పాత్రలను పోషించి అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వాసం ప్రభాకర్, హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు చక్రధర్, రాము, రాజశేఖర్, నర్సిరెడ్డి, సీఆర్పీ స్వామిగౌడ్ పాల్గొన్నారు.



అర్వపల్లి : బహుమతులతో విద్యార్థులు

అర్వపల్లి : మండలంలోని లోయపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ పాత్రలు పోషించి అలరించారు. ప్రతిభ చూపిన వారికి షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంట యల్లయ్య, ఉపాధ్యాయుడు కొమిరిశెట్టి లింగయ్య, సీఆర్‌పీ రామిడి వెంకట్‌రెడ్డి, సిబ్బంది పగడాల వెంకన్న పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

భానుపురి (సూర్యాపేట) : ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం సట్టు యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రవాణా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినా స్పందించని నేపథ్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వజ్జే సైదయ్య, సహాయ కార్యదర్శులు బచ్చలకూరి స్వరాజ్యం, పంతం వెంకన్న, జిల్లా నాయకులు ఇరుగు రమేష్ పాల్గొన్నారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలి

తుంగతుర్తి : న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని సమగ్రంగా రూపొందించి అమలు చేయాలని తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనం పెంచాలన్నారు. జిల్లాలోని అన్ని కోర్టులకు త్వరితగతిన సొంత భవనాలు, స్టాఫ్, ఇంఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తొగిటి మురళి, జాయింట్ సెక్రటరీ బానోతు సతీష్, బానోతు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

వడదెబ్బపై ప్రజలను చైతన్యపరచాలి

అర్వపల్లి : వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా సంబంధిత అధికారులు వారిని తగు విధంగా చైతన్యపరచాలని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్‌నాయక్ కోరారు. స్థానిక పీహెచ్‌సీలో వడదెబ్బపై బుధవారం వివిధ శాఖల మండల స్థాయి అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీలు ఉదయం 11గంటలలోపు, సాయంత్రం 4గంటల తర్వాత పనులకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ, సీహెచ్‌ఓ ఎం.బిచ్చునాయక్, నాయబ్ తహసీల్దార్, సీహెచ్.యాదగిరి, సూపర్‌వైజర్ లలిత, ఏపీఓ సీహెచ్.ఉపేందర్, ఈసీ నగేష్, ల్యాబ్ టెక్నీషియన్ చొక్కయ్య, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విక్రమన్న ఆశయాలు కొనసాగించాలి

భానుపురి (సూర్యాపేట) : పీడిత ప్రజల పక్షాన పోరాడిన విక్రమన్న ఆశయ సాధనకు పోరాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విక్రమన్న (మందడి సత్తిరెడ్డి) 32వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, పార్టీ డివిజన్ నాయకులు ఎస్‌కే సయ్యద్, నవీన్‌రెడ్డి, గోగుల వీరబాబు, పొన్నాల లచ్చిరెడ్డి, మల్లారెడ్డి, పద్మ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి వినతి

నాగారం : మండలంలోని ఫణిగిరి గ్రామసమీపంలో గల అయ్యవారికుంట ప్రాంతంలో దహన సంస్కారాలు నిషేధించాలని కోరుతూ బుధవారం పలువురు గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎర్ర నరేష్, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రాంబాబు, కాంగ్రెస్ నాయకులు తీగుళ్ల సోమయ్య, షేక్ జలాల్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరాములు సేవలు మరువలేనివి

సూర్యాపేట : కమ్యూనిస్టు పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన అనంతుల బుచ్చిరాములు సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, రాష్ట్ర సమితి సభ్యుడు కేవీఎల్, గీత పనివారల సంఘం రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం అన్నారు. పట్టణానికి చెందిన అనంతుల బుచ్చిరాములు బుధవారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట రాష్ట్ర సమితి సభ్యులు అనంతల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు దొరెపెల్లి శంకర్, రేగటి లింగయ్య, నిమ్మల ప్రభాకర్, అనంతుల జానయ్య, తదితరులు పాల్గొన్నారు.